# సిపిఐ - సిపిఐ(యం)
# నూతన రాజకీయ ప్రత్యామ్నాయ కార్యక్రమం
## బస్సు యాత్ర (13వ రోజు)

తేది : 10 సెప్టెంబర్, 2018.

**ప్రజా పాలన రావాలి**
**డబ్బుతో రాజకీయాలు చేసే వారిని తిరస్కరించాలి**
**సిపిఎం, సిపిఐ బస్సుయాత్రలో నేతల పిలుపు**
**గుంటూరు జిల్లాలో జనాదరణ**

సిపిఎం, సిపిఐ బస్సుయాత్ర పదమూడో రోజు సోమవారం గుంటూరు జిల్లా వినుకొండకు చేరుకుంది. సిపిఎం గుంటూరు పశ్చిమ జిల్లా కార్యదర్శి గద్దె చలమయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అశోక్‌కుమార్ స్వాగతం పలికారు. వినుకొండ, నరసరావుపేట, పిడుగురాళ్ల, సత్తెనపల్లిలో సభలు జరిగాయి. ఈ సభలను ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ పెంచిన పెట్రోల్ ధరలకు నిరసనగా వామపక్షాలు, ఇతర పార్టీలు ఇచ్చిన హర్తాళ్ విజయవంతమయ్యిందని, గుంటూరు జిల్లాలో తామూ పాల్గొన్నామని చెప్పారు. 2014 ఎన్నికల హామీల్లో భాగంగా మోడీ, బాబు ఎన్నో హామీలను గుప్పించారని, అందులో ఏ ఒక్కటైనా పరిష్కారమయ్యిందా అని ప్రశ్నించారు. వ్యవసాయరంగం సంక్షోభం నుంచి బయట పడేందుకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేశారా? రైతుల ఆత్మహత్యలను ఆపగలిగారా? అని మండిపడ్డారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ డబ్బున్న వారే రాజకీయాలు చేస్తున్నారని, అలాంటి స్వార్థ రాజకీయాలను తిరస్కరించి ప్రజాపాలన తీసుకురావాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ నిరంతరం సాగర్ నీరు పారుతున్న గుంటూరు జిల్లాలోనూ నాలుగేళ్లలో 150 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంపై చిన్నచూపు చూస్తున్నాయని, గిట్టుబాటు ధర లేదని, ఎఫ్‌సిఐ గోడౌన్ కూడా మూతబడే దిశగా ఉందన్నారు. చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డిలు ఈ విషయమై మోడీని ప్రశ్నించగలరా? అన్నారు. ఢిల్లీలో ఏనుగుల్లాంటి రెండు పార్టీలను తలదన్ని ఆప్‌ను ఆదరించినట్లే ఈ రాష్ట్రంలోనూ ప్రజలను దోచుకుంటున్న టిడిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్‌లను పక్కన పెట్టి ప్రత్యామ్నాయ శక్తులను ఆదరించాలన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డిఎ, రాష్ట్రంలో టిడిపి పాలనలో కార్మిక హక్కులను హరించివేశారన్నారు. యువతకు ఉపాధి, మహిళా ఆర్థిక స్వావలంబన కల్పించలేదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ పొరుగు దేశాలైన నేపాల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, బర్మాలలో లీటర్ పెట్రోల్ ధర 50-60 రూపాయలుంటే, మన దేశంలో పాలకుల పన్ను విధానం వల్ల 87కి చేరిందన్నారు. సారా ఎరజూపి ఓట్లడిగే పాలకులను పక్కన పెట్టి, ప్రత్యామ్నాయ శక్తులను ఆదరించాలన్నారు. ఈ బస్సుయాత్రలో సిపిఐ రాష్ట్ర నాయకులు జయలక్ష్మి, సుబ్బారావు, లెనిన్‌బాబు, సిపిఎం రాష్ట్ర నాయకులు ఆంధ్ర మాల్యాద్రి, రామన్న, జనసేన నాయకులు సంజయ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.


**(జె.ప్రభాకర్)**
ఆఫీసు కార్యదర్శి
9490098433